# షా...!

"పల్లానికి వొచ్చి, బెదిరిపోయే ఆదివాసీలా వుండదూ – యీ ప్రళయావతీ నది...?" యేవో ప్లాన్‌లూ, కొలతలూ, పరీవాహక ప్రాంత పర్యవేక్షణా చేసిన ఇంజనీర్ చంద్రశేఖర్ అడిగేడు.

పడమటి కొండలలోంచి, రాళ్లూ రప్పల మీదుగా, శబ్దం చేస్తూ, వడిగా ప్రవహిస్తుంది ప్రళయావతీ నది. దీనికి ఎడమవేపున, కొంతదూరంలో ప్రవహించే నాగావళినది యింతవడిగా ప్రవహించదు. శబ్దమూ చెయ్యదు. రెండు నదులూ... కిందకు ప్రవహించి ఒక దగ్గర కలుస్తాయి. ఆ సంగమం వద్ద – వొక సోమేశ్వర ఆలయం, శివరాత్రి జాగారాలు – పల్లెవాసుల తీర్థయాత్రలు...!

మిత్రునికి, అప్పుడేమి బదులిచ్చాడోగానీ, ఆనాటి సంభాషణలో వొకే వొకపదం–బెదిరిన ఆదివాసీ– గుర్తుండిపోయింది. ఇన్నేళ్ల తర్వాత, మళ్లీ ఎందుకా పదం.... యిప్పుడు... మెదుల్తోంది?

బెదిరిన ఆదివాసీలా... తను? ఔనా?

శంభునాయుడి మనసంతా క్రోధంతో...! ఎంతమరల్చుకుందామన్నా, ప్రభుత్వ అతిథి గృహం–మంత్రీ... వలసొచ్చిన దొరబాబులూ, వారితో తొలి పరిచయమూ... గుర్తొస్తోంది..............

సాయుధ భటుల కాపలాలో అతిథిగృహం! రాత్రి ఏడున్నర గంటలవేళ! విద్యుత్ లైట్లు వెలుగుతున్నా, అతిథిగృహం ఆవరణలోని అశోకచెట్లల్లోనా, ఆగిన జీపూ, కార్లల్లోనా, గేటునుండి గృహ ముఖద్వారం వరకూ ఇరువరసల్లో యెదిగీ, యెదగక వొదిగిన క్రోటన్ మొక్కల్లోనా... చీకటి, ఆ విద్యుత్ వెలుగులు తాత్కాలికమూ యీ చీకటి శాశ్వతం... అన్నట్టుగా వుంది. శంభునాయుడు... ఆ చీకట్లనుంచి దృష్టి మరల్చి, గదిలోకి నడిచేడు.

మంత్రిగారికి కుడి, ఎడమల కుర్చీల్లో యెవరో కూర్చున్నారు. కుడి, ఎడమల్లో యేదో వొక స్థానం తనదని అనుకునేవాడు శంభునాయుడు. ఆ రెంటినీ వాళ్ళు ఆక్రమించుకున్నారు! వాళ్ళు చాలా ఖరీదుగా కన్పించారు. వాళ్ళెక్కడినుండో యిక్కడికొచ్చి జెండా పాతాలనుకున్నవారిలా వున్నారు. సూటూ, బూట్లలో దొరల్లా వున్నారు............

"మంత్రిగారిని ఆహ్వానిస్తూ, మన పేర్లతోనూ, మన కంపెనీల పేర్లమీదా, మన పార్టనర్‌షిప్పు గ్రూపు పేర్లుమీదా - పత్రికలకు అడ్వర్టయిజ్‌మెంట్లు యిచ్చేను. షేర్ మహ్మామద్‌పురం తప్పిటగుళ్లు గొల్లలకీ, చోడవరం నాగినీ డేన్స్ ట్రూపుకీ బయానాలిచ్చేను. స్టేజీ డెకరేషనుకి- టీవీ సీరియలు డైరెక్టర్ పండాబాబు కప్పజెప్పేను..." మంత్రిగారి ప్రోగ్రాంకి సంబంధించి, తన కప్పగించిన బాధ్యతలు గురించి, ఒక్కొక్కటీ చెప్పేడు ఉమామహేశు.

ఉమామహేశు కొన్నేళ్ల కిందట భూముల రిజిస్ట్రార్ ఆఫీసు దగ్గర స్టాంపులూ, దస్తావేజులూ అమ్మేవాడు. కోమలీ నుండి విశాఖనగరం దాకా భూములకు రోజుకో లెక్కన ధరలు పెరగటంతో భూములు కొనటం, అమ్మకం ఆరంభించేడు.

ఉమామహేశు చెప్పింది వినలేదు శంభునాయుడు.... యెక్కడోవున్నాడు! వారం, పదిరోజుల కిందట మిత్రులందరూ కలిసేరు. మంత్రిగారి సభా యేర్పాట్లను, తలావొకటి బాధ్యత తీసుకున్నారు. అలా, యెవరి బాధ్యతల్లో వాళ్ళుండగా అర్జెంటుగా రండని శంభునాయుడే సెల్‌లకి కొట్టడంతో, వొకొక్క మిత్రుడూ చేరుతున్నారు.

"ప్రళయావతీ బార్ అండ్ రెస్టారెంట్" దాబామీది గది! ఆ గది శంభునాయుడిది. ఆ డాబాక్రింద ఆవరణ విశాలమైనది. దానిలో... చిన్న చిన్న పర్ణశాలలు. వాటిల్లో ఓ టేబులూ, నాలుగైదు కుర్చీల్లో యజ్ఞవేదికలు. అప్పుడు సమయం- రాత్రి కొమ్మవేళ! వెలుతురు పంచలేని విద్యుత్ బల్బులూ, పదాలు అర్థంగాని స్టీరియో సిన్మా పాటలూ, యెక్కడకు పరుగులు తీయాలో, తీరికలేని సర్వర్లూ, యేవేవో కేకలూ, కబుర్లూ...! ఇవేవీ...పైకి, ఆ గదిలోకి చేరవు. అది ఏసీ గది!

అపుడే వొచ్చి కూర్చుంటూ -

"...ప్రెజలు గడుసుదేరిపోయారువయ్యా. మినిస్టరు పోగ్రాంకి రావాలంటే- వందనోటూ, బిర్యానీ పేకెట్టూ, క్వార్టరు బాటిలూ కావాలట! ఏటివయ్యా, అన్నేయం? ఓట్లకీ ఖర్చే, మీటింగులకీ ఖర్చే - ఎవుడి వశిమయ్యా... యిది భరించడం?

రేషన్‌కార్డులో, ఇళ్లపట్టాలో, యేవోపథకాలో వొస్తాయి గదర్రా అని అంటే- ఆటికెలాగూ, మీ వాటా మీరడుగుతారు గదా-అనంటన్నారువోయ్. యేటివయ్యా యీ అన్నేయం..." అని, ఆక్రోశించేడు, పట్టణ యువసేన లీడరు కర్రి అప్పలరెడ్డి.

కర్రి అప్పలరెడ్డి తాతగారు 'కోమలీ' మున్సిపాల్టీగా యెదగని రోజుల్లో మోతుబరి రైతు. తాతగారి భూమీ పుట్టనీ కరిగించలేదుగానీ, వెండీ, బంగారాలూ, ధన, ధాన్యాలూ కరిగించి "పొలిటికల్లీడర్" అయినాడు తండ్రి. కాంగ్రెసు జెండాకి పునాదిబలం కర్రివారి వంశానిదే, ఎర్రిబాబు (ఎర్రయ్యరెడ్డి, అప్పల రెడ్డి తండ్రి) దే ఆ కీర్తి! ఆ తరువాత, ఆ పునాదికి బీటలొచ్చి, జెండా ఊగా, తూగా అవుతుంటే భూమినీ కరిగించుతూ ఎర్రిబాబు

కొడుకు అప్పన్న (అప్పలరెడ్డి) బాబు నిలబెట్తండు. కోమలి, పంచాయితీ నించి మున్సిపాల్టీకి యెదిగిందీ నాటికి!

రేపు, పట్టణ ప్రెథమ పౌరుడవడేటండీ అప్పన్నబాబు...?

అప్పలరెడ్డి ఆక్రోశానికి-ఉమామహేశ్ ఉలకలేదు. ఆమ్లేట్‌పిసరు నోట్లో వేసుకుని, పచ్చిమిరప ముక్కతో సహా నమిలి, గ్లాసులో విస్కీని గుటకేసాడు. మరో మిత్రుడు, మాజీ జర్నలిస్టు మూర్తి, మౌనంగా సిగరెట్ వెలిగించేడు, రెండు రౌండ్లు పూర్తిజేస్సి! పోతిన క్రిష్ణసోంవిపాత్రుడు, ముంతఖాళీ జేసేపనిలోబడి పలుకలేదు. అతనికి ముంతతో తాగటం యిష్టం. చంటిపిల్లలు గోకరంతోటి చేదు తాగినట్టుగా పెగ్గుల్తోటేటఁరా, సెసే...! రాగిముంతతో కాశీజలం తాగినట్టుగుంతాది ముంతతో తాగితే, అనంటాడు. నువ్వు మూడో రౌండు కొచ్చేసరికి, అతగాను ముంతఖాళీజేస్సి, మూతితుడిస్సి గోనెసంచీలోకి సీతాఫలాలు నింపినట్టూ ముందరున్న ప్లేట్లలోని చికెన్‌ఫ్రై, ఆమ్లెట్లు, ఫిష్ కర్రీ కడుపులోకి నింపేస్తాడు. ఆలూచిప్సూ, డాల్‌పప్పూ, మిక్చరూ లాంటివి నీకు మిగిల్చి తిను, తిను, బాగుంతాయి అనంటాడు.

పాత్రుడిది ట్రాన్స్‌పోర్ట్ బిజినెస్. అతనికున్న లారీల బాడీల మీద ఏఎల్‌టి అన్న ఆంగ్ల అక్షరాలుంటాయి. అమ్మాజీ లారీ ట్రాన్స్‌పోర్ట్ అన్నమాట! అయితే అమ్మాజీ భార్య పేరా? ప్రియురాలి పేరా? అన్న శంక అక్కడి జనంలో మిగిలిపోయింది. తేల్చడానికి ఆ యిద్దరూ లేరు. ఆ మధ్యనే కాలి, బూడిదై, భూమిలో కలిసిపోయేరు.

అప్పలరెడ్డి అప్పుడు, శంభునాయుడి వేపు చూసేడు. శంభునాయుడు గ్లాసు ముట్టుకోలేదింకా. ఏసి గాలి చల్లగా తగుల్తోంది. గది కిటికీ రెక్కల్లో వొకటి – యెందుకో కిటకిటలాడింది.

శంభునాయుడు ఆలోచనల్లోనే వున్నాడు.............

"....అందరికీ యేమోగానీ, వొకవిధంగా మీ మంచికే జరుగుతోంది. ఇక్కడ, యీ వెనకబడ్డ, యీ కొండమూల ప్రాంతంలో యీ భూముల విలువెంత? వీటిలో యెంతంతపిండితే మాత్రం వొచ్చే రాబడెంత? ఈ పిండడానికి మీరు పడే కష్టమెంత? మీరు మూట గట్టుకునేదెంత?" అని; కొన్ని ప్రశ్నల రూపంలో, తేల్చివేసి-

'...జన వ్యతిరేకతని మాత్రం మూట గట్టుకుంటున్నారు. మీరేదో దోపిడీ, దౌర్జన్యాలు చేస్తున్నారన్పించు కుంటున్నారు. వొద్దు, వొద్దొద్దు. అవతల, మీకు అనువైన పట్నముంది. నగరముంది. రాబోయే రోజుల్లో పట్నాలదీ, నగరాలదే వైభోగం. పల్లెలది కాదు. ఈ రిజర్వాయర్ పుణ్యాన మీరిక్కడ్నించి బయటపడటమే మంచిది. ఇది, మీ మంచికే..."

ప్రళయావతీ రిజర్వాయర్ నిర్మాణానికి, అక్కడి భూవీ, పుట్టా, యిల్లూ, పొల్లూ,

ప్రభుత్వం స్వాధీనపరచు కునేటపుడు – ఇంజనీర్ మిత్రుడు చంద్రశేఖర్ అన్నమాటలు గుర్తొచ్చేయి శంభునాయుడుకి.

అప్పటికి ప్రళయావతీ రిజర్వాయర్ కోసం స్వాధీనం చేసుకున్న భూముల ధరలపై చర్చలు జరుగుతున్నాయి. తెగలేదు. గానీ, ప్రభుత్వం మాత్రం భూముల మీద నిర్మాణ పనులారంభించింది.

ఊళ్లింకా ఖాళీ అవలేదు. గానీ, ఊళ్లచుట్టూ భూముల్లో లారీలూ, ట్రాక్టర్లూ ఒరిస్సాలేబరూ, ఇంజనీరింగ్ ఉద్యోగులూ, కాంట్రాక్ట్ కంపెనీలూ – వారందరికోసం టెంపరరీ షెడ్లూ, షాపులూ...! పచ్చని పొలాల్లో వాహనాలూ, మట్టి ఎత్తిపోస్తున్న దుమ్మూ, ధూళీ!

సర్కారు ఉద్యోగుల్నీ, కాంట్రాక్టు కంపెనీ వార్నీ, వాహనాల్నీ లేబర్నీ... యెవర్నీ చూసినా యెగసిపడే కెరటమయ్యే – తండ్రి. తన దేశమ్మీదకి దండెత్తే పరదేశ సేనలా అన్పించేదేమో అందరితో తగవాడేవాడు!

తాతలూ, తండ్రులూ, వారి వంశవృక్షాలు, వంశవృక్షాల పేర్లతో యేర్పడ్డ గ్రామాలు, గ్రామాల్లో బంధుగణం, పంటలూ, భాగ్యాలు, పండగలూ, పబ్బాలు, పంచాయితీలు, పెత్తనాలు... ఘర్షణలు... గెలవటాలు యిదీ తండ్రి యెరిగిన జీవితం.......

"...ఏటివోయ్ శంభునాయుడూ, గ్లాసు ముట్టుకోలేదు. మాటా మంతీ లేదు. మాటుకి గూకున్న వేటగాడిలాగా సడీ సప్పుడు లేదేటివోయ్? మినిష్టరు ప్రోగ్రాంగానీ కేన్సిలయ్యిందా, కొంపదీసి?" అనడిగేడు క్రిష్ణస్వామి పాత్రుడు. పాత్రుడప్పటికి ముంతఖాళీ చేస్సాడు. శంభునాయుడు, ఆలోచనల్లోంచే ఉహూ అనన్నాడు.

"అయితే మరి గ్లాసందుకో. నువ్వే అర్జంటుగ రండన్నావు. 'గ్లాస్‌బాట' పెట్టేవు. మరి గానీయి..." అని, పాత్రుడు, గ్లాసందించేడు.

ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచి, గ్లాసందుకున్నాడు శంభునాయుడు. అప్పటిదాకా, ఆ 'గ్లాసుబాట' కు, స్వామిభక్తితో యేర్పాట్లన్నీ చేసిన సేల్స్ మేనేజర్ నాయుడితో వినయంగా–

"...పదవి వొచ్చిన ప్రథమ పర్యాయం మంత్రి మన పట్నమొస్తండు, పదీ మండలాల జనం జమగూడుతారు. మన దగ్గరి సరుకు చాల్దు. మెయిన్ గోడాం నుంచి తెల్లారేసరికి సరుకు పంపమని చెప్పండి. ఇదిగోండి సెల్లు. మీము చెప్తే ఆ గొడాం మేనేజరు యిన్డు. గోదారి జిల్లావోడు గదా, గోవోర్జినమెక్కువ. ఫోన్ చెయ్యండ"ని సెల్ యివ్వబోయేడు.

వొద్దు – అన్నాడు శంభునాయుడు. తర్వాత గ్లాసు ఖాళీ చేసాడు. సేల్స్ మేనేజర్ మళ్లీ గ్లాసు నింపేడు. రెండు గుక్కల్లో అదీ ఖాళీ. మళ్లీ నింపేడు... మళ్లీ...

సేల్స్ మేనేజరూ, మిత్రులూ ఆశ్చర్యపోతున్నారు. గానీ, శంభునాయుడికి యేవో ముడులు తెగటం లేదు. ఒకదాని గురించి ఆలోచించబోతే– యింకేదో గుర్తుకొస్తోంది.

ప్రభుత్వ అతిథిగృహంలో మంత్రిని కలసిన తర్వాత నుంచీ - ఈ మధ్య... అలాంటి సందర్భాలే... మరో రెండు! అప్పట్నించీ-

ఆట.. ఆడుతున్నారు. అర్థంకాని యెత్తులు వేస్తున్నారు. మాయజూదం- దీన్ని ఓడించేదెలా? ఓడించాలి....! ఎలా? యివే నాయుడు మనసు నిండా...

"కార్యాలయాలూ, న్యాయస్థానాలూ, చట్టసభలూ, మార్కెట్లూ వగైరాలు మాయాజూదపు కేంద్రాలు ! మాయా జూదం ఆడించుతారు, మీరే ఆడించి, మీరే గెలుస్తారు. గానీ, గెలుపు శాశ్వతం కాదు. తాత్కాలికం..."

వో సందర్భంలో, రైతుకూలీ సంఘం నాయకుడు, అలనాడు చేసిన హెచ్చరిక గుర్తొచ్చింది. ఎందుకు నాకీ రోజు యింతగా గతం గుర్తుకొస్తోందనుకుంటూ... తల విదిలించేడు శంభునాయుడు.

తాతలూ తండ్రులూ.. వారికి ప్రత్యర్థులు - స్థానికులు...! ప్రతర్థుల బలాబలాలు తెలిసేవి. వాళ్లకి గెలుపు, ఓటమిలు రెండూ వుండేవి! గానీ... తనకు, యీ ప్రత్యర్థులు స్థానికేతరులు...! దాదాపు పదేళ్లపైగా... స్థానిక ప్రత్యర్థులే...! వారిది అధికార పార్టీ రాజకీయం. నిలిచి, పోరాడేం...! నేడు మేం అధికారపార్టీ... గ్రూపు వాళ్లం. అయినా, మరేమిటిది? కొత్తనీరు, పాతనీటిని...? ఔనా...

"..దాదాపు అర్థభాగం పని పూర్తయ్యింది. ఊళ్లచుట్టూ... యిక నీళ్లముంపు... ఊరు ఖాళీ చేయటం మంచిది..." ఇంజనీర్ మిత్రుడి సలహా!

ఆ మిత్రుడన్నీ మన మంచికే అనేవాడు. ఊరు ఖాళీ చేయటం, భూములు వొదులుకోవటం... అన్నీ మంచికేనట..! అది గుర్తు జేసుకు నవ్వుకున్నాడు శంభునాయుడు....

"మినిస్టరు నిన్ననే వొచ్చీసేడట? గెస్ట్ హవుసుల వున్నాడట? నువ్వు కలిసావట? ఏటివోయ్ భోగట్టా...? నువ్వెల్లీసరికి-మినిస్టు వొక్కడే వున్నాడా, మళ్లా, ఆ వలసదొరలు- కుడెడమలు కాపుగాస్సేరా...?" అనడిగేడు, పాత్రుడే.

శంభునాయుడు మళ్లీ, మంత్రిగారి వద్ద తొలిసారి వాళ్లతో పరిచయాలలోకి.........

"రా.. రా, రావోయ్ నాయుడూ, రా. కూచో. వీళ్లూ మనవాళ్లే, ఇండస్ట్రియలిస్టులు. ఐటీ, బయోటెక్, యింకేవో యిండస్ట్రీలు పెడ్తారట. మనకు కావలసిన వాళ్లే..." అని, మంత్రి- తన కుడి, యెడమల వారిని, పరిచయం చేసాడు.

వీళ్లు మనవాళ్లే అని, పాండవుల్ని కృష్ణుడు పరిచయం చేస్తే కర్ణుడు వారిని చూసినట్లు చూసేడు శంభునాయుడు వాళ్లను.

వాళ్లుగాక, మరో ముగ్గురు యింకో సోఫాలో కూచున్నారు. వాళ్లు కార్పొరేట్ కాలేజీలు, అస్పత్రులూ, స్టార్ హోటళ్ల అధిపతులు. అంతకుముందు నుంచీ తెలిసిన వాళ్లే. వాళ్లే పలకరించి, నమస్కరించేరు శంభునాయుడికి.

కుడి, ఎడమల వాళ్లు నవ్వులు విసిరేరు. కుశల ప్రశ్నలు వేసారు. కాసేపయ్యాక హైలెవల్ బిజినెస్ లోకెందుకు దిగలేదనడిగేరు. హైటెక్ సిటీ నెందుకు కట్టలేదన్నారు. ఐ.టీ.లో పరిచయం లేదా... అని ఆశ్చర్యపోయేరు. ఎబ్రాడ్ వేపెందుకు చూపు విసర్లేదన్నారు.

వారిముందు, తన యిన్నేళ్ల వ్యాపార జీవితమూ వెలవెలబోయింది. ప్రళయావతీ నుంచి, నీ మంచికే, తరలిపో అన్న ఇంజనీర్ మిత్రుని సలహా ప్రకారం, విశాఖకు దగ్గరలోగల అత్తవారి ఊరు 'కోమలీ'కి చేరటం.. రకరకాల వ్యాపారాలు, కాంట్రాక్టులు చేయటం, ఎదుగుతున్న కొద్దీ.. పోటీ యెక్కువ గావటం.......

తొలినాళ్లలో వొక వ్యాపార కంపెనీకి జిల్లా ఏజన్సీ, తర్వాత, పోర్టులో సబ్‌కాంట్రాక్ట్ వర్క్, మరి కొన్నాళ్లకి లాడ్జింగ్ హౌస్ నిర్వహణ, అపుడే, బావమరిదితో పార్టనర్‌షిప్ కలిపి జూనియర్ కాలేజ్ నిర్వహణ.. యిలా యెన్నో...

కాలేజీలో వో రభస జరగటం వొకవేపు, అప్‌గ్రెడ్ చేసే ప్రయత్నం మరోవేపు. అప్పటి ప్రత్యర్థి వర్గపు చదరంగంలో బావమరిదేమో, వారి పంచన చేరటం, తను కాలేజీ పార్టనర్‌షిప్ వొదిలేసి, సారా బిజినెస్‌లోకి దిగి, సిండికేట్ మెంబరు కావటం...!

ఇన్నిజేసినా– నగరం యెదిగేకొద్దీ... పోటీ పెరగటం–అపుడే నలుగురు మిత్రులు కలిపి, జాయింట్ కంపెనీ కావటం.. అంతా వొక్కసారి పునశ్చరణ చేసుకున్నాడు శంభునాయుడు.!

అప్పుడే తను కొన్ని పాఠాలు నేర్చుకున్నాడు. వాట్ని కూడా గుర్తులోకి తెచ్చుకున్నాడు. ఎదగటానికి ప్రయత్నించటమే కాదు, ఎదుటి పక్షం నిన్ను దెబ్బ కొట్టకముందే నువ్వు దెబ్బతీసెయ్యాలన్నది తొలిపాఠం. మీదకు ఎక్కగానే నిచ్చెనను తొలగించాలన్నది మరోపాఠం. నీకంటే పైమెట్టు మీదనున్న వాడిమీద గౌరవాన్ని నటించి, నమ్మించి కిందకి లాగెయ్యటం – కింది మెట్టునున్న వాడికి పైమెట్టు వేపు దృష్టి సారించకుండా, కింది చూపునే దివ్యదృష్టి అని నమ్మించటం... యింకో పాఠం,

వీళ్లు పైమెట్టు మీద నున్నవారు...! వీళ్లకెన్ని పాఠాలొచ్చునో...! కొంపదీసి వీళ్లూ... నాకు కిందివేపు మాత్రమే చూసే దివ్యదృష్టి...?

శంభునాయుడు మనసంతా చీకాకు... చీకాకు. అప్పుడు, నవ్వుతూ, మంత్రిగారు–

"...మావాడు రీజనల్ లెండి. ఒరిజినల్‌గా రిమోట్ ఏజన్సీ ఏరియా. అక్కడి నుండి కోమలి వొచ్చేడు. కోమలినుండి సిటీకి యెగబ్రాకేడు. ఎబ్రాడ్‌కి యెగరటానికి రెక్కబలం చాల్దులెండి.." అనన్నాడు.

ఎగరటానికి రెక్కబలం చాలనందుకు అనందం వ్యక్తమైందాయన మాటల్లో. అప్పుడే, మంత్రి మీద మండింది......

"ఫోన్ చేసీయండి. అందుకోండి సెల్లు. తెల్లారేసరికి సరుకుండాల, పదిమండలాల జెనం తోటి– చచ్చీ చావయిపోద్ది. ఫోన్ చేసీయండి..." సేల్స్ మేనేజర్, మళ్లీ చెప్పేడు.

"...ఔనువయ్యా, చేసీవయ్యా, లేకపోతే పది మండలాల జెనం... తిట్టి పోస్సీగల్రు! తాగడంకి దోసెడు గంగ యెలాగూ కరువే, నంజికొడుకుల రాజ్జెంల! సారా సుక్కలకీ కరువేనా నంజికొడుకుల రాజ్జెంల అని బూతు పురాణం యెత్తగల్రు...!" అన్నాడు పాత్రుడు.

శంభునాయుడి ఆలోచన లాగినయి. పాత్రుడివేపు చూసేడు. పాత్రుడు యువసేన లీడరు కర్రి అప్పలరెడ్డి వేపు చూసేడు. కర్రి అప్పలరెడ్డి. –

"...ఔనండీబాబు! అపోజిషనోళ్లు ఇదే సందూ, మైకొట్టుకుంటారు. మా టైముల మీటింగంటే ఎలాగుండేది? ఆ బిర్యానీ పేకెట్లేటి, ఆ బ్రాందీ బాటిల్లేటి, ఆ వంద నోట్లేటి, ఆ రోజులు మరి లేవర్రా.. మీకు, అని జనాన్ని ఊరించీగల్రు. సరకు రప్పించీయండీ బాబూ..." మొత్తుకున్నాడు.

అయినా, వొద్దన్నాడు శంభునాయుడు.

అందరూ ఆశ్చర్యపోయేరు. మందుగుండూ, మందూ, మ ము లు ల్లేకుండా మీటెంగెలా సక్సెసవుతాది. ఏటితగాని ఆలోచన – ప్రశ్నార్థంకగా చూసేరు. శంభునాయుడు – వొరే సేల్సూ, గ్లాసు నింపు అనన్నాడు. సేల్స్ గ్లాసు నింపేడు. నిండిన గ్లాసు ఖాళీ చేసాడు శంభునాయుడు.

"యితగాను.. యెప్పుడూ యింతే. సెప్పింది యినడు. బుర్రని పుట్టిందే... బుద్ధి అంటాడు. ఇతగాన్ని నమ్ముకొని– చదువుని చంక నాకించీసినాను. డిగ్రీ పూర్తి చేసుండినా– బాగున్నేమో. ఎక్కడో గవర్నమెంటు ఆఫీసుల – గుమస్తాగా కుదిరిపోయిందును. ఆఁ...అదంత సవకా?

అయినా, యెక్కడిదీ అవకాశం? ప్రళయావతి రిజర్వాయర్ అయ్యిందీగాదు, ఆగిందీ గాదు! ఇల్లూ, పొల్లూ పోయింది. నష్టపరిహారాలు అప్పులకీ, అప్పజెల్లెల పెళ్లిళ్ళకీ ఆరిపోయింది. ఇతగాడంటే మోతుబరోడు. ఏనుగు తొంగొంటే ఎద్దు పొడవుంతాదనొట్టినే అనరు! తండ్రిని ప్రళయావతి కాల్వవొచ్చే పంట భూముల ఊరిలోదించి, యితగానీ పట్నంలో దిగేడు.

మాలాటి అనాది, మనాదోళ్లమే....గూడు చెదిరిన పక్షులైనాం. ఎగిరెగిరి... యితగానికాడ యెందుకు వాలినాను? ఇతగాను... ఇందులోనించి అందులోకి, అందులోంచి, మరొకందులోకి గెంతుతాడు. ఈయనకేటి? గెంతగల్డు...! మనవొశిమా? ఈ రెస్టారెంటు, బ్రాందీ షాపూనీ... ఊబిల దించీకురా నాయనా" సేల్స్ మేనేజర్, అంతరంగంలో మధనపడసాగేడు.

"...నంజి కొడుకులు గడులు నప్పుతన్నారు. కనబడకుండా పావులు కదుపుతున్నారు..." అన్నాడు శంభునాయుడు ఖాళీ గ్లాసు వేపు చూస్తూ ఆ మధ్య మరోసారి, మంత్రిగారిని కలిసినపుడు- మళ్లీ కుడి ఎడమల్లో ఆ వలస దొరలే వున్నారు. కాసేపటికి, సోపాలోని వాళ్లూ వొచ్చేరు. కాసేపు అవీ యివీ కబుర్లు.

ఆ తర్వాత- వాళ్లు-

నీటికీ, నాగరికతకీ సంబంధముందన్నారు. నాగరికత అభివృద్ధికి చిహ్నమన్నారు. అభివృద్ధి - రాజకీయాలకి 'లక్ష్యం' కావాలన్నారు. ఎందుకు చెప్తున్నారో శంభునాయుడికి అప్పుడంతు బట్టలేదు. గానీ, వాళ్లు నిర్దేశించే జాతికి చెందిన వాళ్లూ అని మాత్రం అర్థమైంది.

వాళ్లు మంత్రిని నిర్దేశించ...!?

ఇకమరి ముందుకి ఆలోచించ, మనసొప్పలేదు శంభునాయుడికి. అవి గుర్తొచ్చి...

"కట్టించీయాల. ఆట కట్టించీయాల. ఈసారి, కొట్టేమా, దెబ్బకి నంజికొడుకులు, దేశాలు బట్టీయాల...!" అనన్నాడు శంభునాయుడు.

ఎవరా దొంగాట ఆడుతున్నారో, పావులు కదుపుతున్నారో, తమ శత్రువులెవరో!? చెప్పమని శంభునాయుడ్ని అడిగేడు పాత్రుడు. తల దీర్ఘంగా, కిందకీ, మీదకీ ఊపుతూ- మీకు తెల్దు- అనన్నాడు శంభునాయుడు.

గడులేటి! పావులేటి! ఆటాడటమేటి! అని ఆశ్చర్యపోయి, యువసేన లీడరు, కర్రి అప్పలరెడ్డి- నమస్తె, నారాయణ, వొక్కముక్క బోధపడ్లేదు- అని ప్రకటించి, గ్లాసందుకున్నాడు. గ్లాసు ఖాళీ జేసాక, మైండ్ ఏక్టివేటయ్యింది గామోసు-

"కాదండీ. మనకేటి కొత్త అటండీ? ఎన్ని యేళ్ళు- అపోజిషన్ పార్టీవోలి తోటి పడ్డాం. ఇపుడు- మనది పవర్ పొజిషన్. మనకేటి? నియోజికవర్గం మన్ది. ఇక్కడ నెగ్గిన ఎమ్మెల్లే మనోడు! మంత్రయినాడు. మనకేటి?" అని, భరోసా యివ్వబోయేడు.

"...అంతే. మనకి వార్డు, అది దాటితే మున్నిపాల్టీ, మించితే ఎసెంబ్లీ సెగ్మెంటూ, అంతే. అక్కడికి మన మైండ్‌కి ఓవర్ ఓల్టేజయిపోద్ది. ఫిలమెంట్ రాలిపోద్ది. గానీ, ఆళ్లలక్కాదు. హైవోల్టేజీగాళ్లు. ట్రాన్స్‌ఫార్మర్లాటోళ్లు... నంజికొడుకులు..." శంభునాయుడు, పళ్లు కొరికేడు.

యే నంజికొడుకులో తెలియక, కుపితుడై ప్రశ్నించేడు పాత్రుడు. మళ్లీ మీకు తెల్దు అన్నాడు శంభునాయుడు.

అంతే! కోపం నషాళానికెక్కింది పాత్రుడికి. గభాల్న గ్లాసులోని విస్కీ తాగేసి, గ్లాసు నేలకేసి కొట్టి-

"...యిందాకటినించీ యింటన్నాను. ఏటండీ, యెవడండీ, నంజికొడుకెవుడండీ అనడుగుతుంతే- మీకు తెల్దు, మీకు తెల్దు- అని పాడిన పాటనే పాడతావండీ? అదేనా, పెద్దమనిషి తీరవండీ?

నిజవండి, మాకు తెల్దండి. నిజవండి. తెలిస్తే, మా వొయిజాగ్ మడకకి– అట్నించి కిష్ణా, గోదారి నంజికొడుకుల్ని (నా నోరు మంచిది కాదు) గానీ, యిట్నుంచి వొంశధారా, నాగావలి నంజికొడుకుల్ని గాని రానిద్దుమా? వొయిజాగుని వొప్పజెప్పేద్దుమా? తెల్దుగాబట్టే, అందరి నంజికొడుకుల ఆగడాలూ, ఆటలూ చెల్లుతున్నాయి. అది గాదండీ మగతనం. తెల్సిన ఆట ఆడండి. రాండి. సవాల్...డీచ్‌బబ్బా.. యే ఆట ఆడ్తావ్? కుస్తీ, కఱ్ఱసాము, సంగిడీ లెత్తడం, కబాడీ....? కాదంతావా దుక్కులు దున్నటం, బరువులు మొయ్యిటం... సేలంజ్. మాకు తెల్సిన ఆట ఆడండి, గెలుచుకోండి. అదండి మగతనం. యేలండీ దొంగాటా? దొంగ గెలుపూ? త్ఫూత్..” ఛీత్కరించేడు.

పాత్రుడి కోపానికి, అందరూ మౌనం వహించేరు. కాసేపయ్యాక, రియలెస్టేట్ ఉమామహేశ్ మాత్రం– కౌరవులు అలాంటి ఆట ఆడే గెలిచారు గదేటి అనన్నాడు.

“...గెలిచారు. ఔనువోయ్.గెలిచారు! ఏటి గెలిచారు? గెలిచిందెన్నాళ్లనుభవించేరు? ఆ తరాతేటయ్యింది? దుంపనాశనమయిపోయింది వంశమంతా. గెలవగానే... సంబరం కాదు...” అని, ఉమామమేశుని దబాయించి, కాసేపాగి, తనని తాను నిదానపరచుకొన్నాక, పాత్రుడు మళ్లీ –

“...యిప్పుడికేనా, చెప్పు, గుడి వెనక శివాలెయ్యడమేల? పోనీ, నీ వరకొద్దండి. మీము చాల్నండి, మా కొదిలీయండి, నువ్వొద్దు. దొంగ ఆట ఆడినోడికి దొంగ దెబ్బ తీసెస్తాం. ఇంటికి అగ్గిపెట్టడం, తిండిల విషం కలిపీడిం, నిద్దురలున్నోడిని నిద్రలోనే చంపీడిం, పురాణకాలం నాడే జరిగేయి. మనకా ఓల్డు ఫేషన్ అవసరమైతే అదే చేద్దుం. కాదూ, న్యూమోడల్లో జరపాలంటే కరెంట్ షాకులు, కారేక్సిడెంట్లు, టీవీబాంబులు, మందు పాతరలు... సిట్యుయేషన్ బట్టి సెట్టింగ్ చేద్దుం. మా కొదిలీ, అవన్నీ! నీకొద్దు, నువ్వు పెద్దమనిషివి...” అనన్నాడు.

“...మనం పెద్దమనుషులం కామేటయితే?” ప్రశ్నించేడు ఉమామహేశ్.

“...ఎందుక్కారూ? మీరు సద్దాంహుస్సేనో, బిన్‌లాడెనో లాంటోళ్లు...” అప్పటిదాకా మౌనంగా, గ్లాస్‌బాటలోనున్న.. మాజీ జర్నలిస్ట్ మూర్తి, నవ్వుతూ పలికేడు.

“ఓసీ! ఆహా! అయితే, యితగాను జెవహార్లాల్‌నెవురూ యేటి?” కంఠం సించుకున్నాడు యువసేన లీడర్.

అందుకు మూర్తి, మళ్లీ అదే నవ్వుతో –

“...మీ సంగతలాగుంచండి. గానీ, అవతలి వాళ్లు బుష్లూ, బ్లెయిర్లూ” అనన్నాడు. అందరొక్కసారి తృళ్లిపడ్డారు. బుష్లూ, బ్లెయిర్లూ తమకి శత్రువులా!? ఓర్నాయినో, వాళ్లా దొంగాట ఆడతన్నారు? ఆళ్లుగాని ఆడితే వోడించగలమా? మన వొశిమా? ఏటింత దేంజర్ల పడిపోనాం? పరమాత్ముడా యెలాగరా?

అందికే గావాలా, నాయుడంత గింజుకున్నాడు. అందికే గావాలా, మీకు తెల్దు, మీకు తెల్దు అనన్నాడు, అంతే గదేటి. మనకి తెలుసేటి? అమెరికా, లండన్ బుర్రల్తోటి పోటీ... మన బుర్రా? దేశ, దేశాలే సాలటంలేదు? మనమేపాటి? మన వొయిజాగు మడక అనగా యేమాత్రం?

పాత్రుడూ, యువసేన లీడరూ, ఉమామహేశూ పరిపరివిధాల తమ విపత్తు గురించి, లోలోపల గుణించికోసాగేరు.

శంభునాయుడెక్కడో.......

"...మంచి పన్జేసావు. అప్పుడు, తొలినాడు మనం కొన్న ధరకి యిప్పుడు భూమి దొరకటం లేదు. పట్నాల్లోని డాక్టర్లూ, యెక్కడెక్కడి కమ్మాలూ, రాజులూ, దిగిపోయి ధరలు పెంచీసేరు. అయినా ఆళ్లలాగ, పాతపద్ధతి పంటలొదిలీసి, పళ్లతోటలూ, పత్తితోటలూ, పామాయిల్లాటివీ, మార్కెట్ పంటలేస్తే; టాక్టరూ గట్రా కొనుకుంటే గిట్టుబాటు బాగుంతాది.... ప్రళయావతి కాలవ యికన వొచ్చీదా? పూర్తయిపోదా, ఆ రిజర్వాయిర్..." పదేళ్ల కిందట-తను, విశాఖలోని సంపాదనని కొంత, ఆ ప్రాంతభూములమీద, పెట్టదలచినప్పుడు తండ్రి పలికిన మాటలు! తండ్రి పంటల్నీ, పల్లెనీ యెంతగా ప్రేమిస్తాడు...!? నిజంగా అందుకోసమే, నేను పెట్టుబడుల్తో తిరిగొచ్చేస్తున్నా సనుకున్నాడు. గానీ, యిక్కడ వ్యాపార పోటీ తట్టుకోలేక అన్నది తండ్రికి తెలీదు!

మళ్లీ, యిప్పుడు...

అలనాడూ, మూర్తే దారి చూపేడు అందరికీ, అంచేత మూర్తి వేపు చూసేరందరూ, అతడే యేదో వ్యూహం పన్నగలడని! గతంలో ఓసారిలాగే- మూర్తి వ్యూహంతో, నలుగురూ ఐక్యంగా నిలబడి- వ్యాపారంలో పోటీని తట్టుకొని నిలబడ్డారు.

మూర్తి... విశాఖలో ఆరంభమయ్యే ప్రతి పత్రికకీ కొన్నాళ్లు ఎడిషన్ ఇన్‌ఛార్జిగా పనిచేసేవాడు. ప్రతీ పత్రికా నిలదొక్కుకున్నాక మూర్తిని నిలవనిచ్చేది కాదు. అంచేత కొన్నేళ్లకి స్వతహాగా వొక సాయంకాల ప్రాంతీయ దినపత్రిక "నిజం" నడిపేడు. పత్రిక నడపటానికి నిజాలక్కర్లేదన్న నిజం తెలిసేలోగా అప్పుల్లో మునిగిపోయేడు. శంభునాయుడి కాలేజీ పార్టనర్‌షిప్ గొడవా, కాలేజీలో యింకేదో రభసా సందర్భంలో నిజం పత్రిక నాయుడికి అండగా నిలబడింది. నాయుడు, తర్వాత మూర్తికి అండగా నిలబడ్డాడు. పాత్రుడ్నీ, అప్పలరెడ్డినీ పరిచయం చేసాడు. వీరి సహకారంతో వొక ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకొని, అందులో పత్రిక గానీ, సాహిత్యం గానీ అచ్చు వెయ్యబోనని ఒట్టుబెట్టుకొని, శుభలేఖలూ, ఓటరులిస్టులూ, రేషన్ కార్డులూ వగైరాల ప్రింటింగ్ బిజినెస్‌తో హాయిగా రోజులు వెళ్లదీస్తున్నాడు. చాన్నాల్లు జర్నలిజంలో వుండటాన మార్కెట్ శక్తులూ, పొలిటికల్ శక్తులూ,

బ్యూరాక్రటిక్, జ్యుడీషయరీ, పోలీస్ ఫోర్స్ తదితరాలు మిగిలిన మానవులకు కనబడనంతటి బ్లాక్ అండ్ వైట్‌లో... మూర్తికి కనబడ్డాయి. అంచేత వీరికి, యిలాంటి సందర్భంలో యేదో ఆలోచించి మార్గం చూపుతుంటాడు. శంభునాయుడు కూడా మూర్తి వేపు చూసేడు.

"మార్కెట్ల మధ్య పోటీలు, చాలా దుర్మార్గంగా వుంటాయి. తడిగుడ్డల్తో కంపెనీల గొంతులు కోసేస్తారు. మీకే గాదు ఇండియాలో వ్యాపార పెద్దలనుకునే వారిక్కూడా మార్కెట్ క్రీడ తెలీదు! మీరు మరీ పూర్..." అనన్నాడు.

మంత్రి సమక్షంలో జరిగిన సంభాషణంతా, రాత్రే మూర్తికి చెప్పేడు శంభునాయుడు. అప్పట్నించీ మూర్తి ఆలోచిస్తూనే వున్నాడు.

"...మీ రెక్కల బలం చాల్దు..." అనన్నాడు మూర్తి.

సరిగ్గా, మంత్రి గూడా యిలాంటి మాటే తొలిసారి అన్నాడని గుర్తొచ్చింది శంభునాయుడికి.

"...అంటే?" అనడిగేడు పాత్రుడు.

"....మీకంటే పెద్ద రెక్కల పక్షులు వలస వచ్చేయి..." అనన్నాడు మూర్తి.

పది పన్నెండేళ్ల కిందటోసారిలాగే యిదే మాట చెప్పేడు మూర్తి – మీ దగ్గరున్న పెట్టుబడి చాలదు. పెరిగిన నగరానికి తగ్గ పెట్టుబడి పెట్టే వాడిదే యిక ముందుముందు నగరంలో వ్యాపారం అన్నాడు.

మూర్తి – కోమలీ నుండి విశాఖ దాకా తనకు జ్ఞానం వొచ్చిన నుండీ జరిగిన మార్పుల్ని విశ్లేషించసాగేడు మనసులో.

ఒకప్పుడు యీ కోమలీ బీచ్ నుండి ఆ యారాడ కొండ దాకా, యిక్కడి మెట్టభూవుల నుండీ అక్కడి నాతయ్యపాలెం, ఆగనంపూడీ పల్లపు భూవుల దాకా నలువేపులా, యెక్కడేది జరిగినా అందరికీ యెరికయ్యేది.

ఈ యిలాకా అంతటా యాదవులు, రెడ్డిలు, గవరలు, నాగాశపోళ్లు, బ్రేమ్మర్లు మెజార్టీ. మిగిలిన కులాల వాళ్లున్నా వీళ్లదే పలుకుబడి. దుకాణాలు, సంతల వ్యాపారాలు, కార్పొరేషన్ ఉద్యోగులు, కాంట్రాక్టులు, పోలీసు జవానుద్యోగాలు, హోటళ్లు, బస్సులు, సిన్మాహాళ్లు, లాడ్జింగులు, రాజకీయాలూ వీళ్లవీ, వీళ్ల నీడన బతికే దిగువ కులాల వారివీ!

యూనివర్సిటీలోకి, కెజీహెచ్‌కీ, తర్వాత పోర్ట్‌కీ–రాజులూ, కమ్మాలు, రెడ్లూ, కర్నాలూ వొచ్చినా – బతుకు బండినే యీడ్చేవారు గానీ, అధికార రథం ఊసెత్తే వారు కాదు... అప్పట్లో!

అప్పటి వ్యాపారాలకూ, వ్యవహారాలకూ, అట్నించి గ్రామాల నుండొచ్చిన మోతుబరులు శంభునాయుడులాంటి వాళ్ల పెట్టుబడీ, యిక్కడి పాత్రుడూ, అప్పలరెడ్డిలాంటి

వారి పెట్టుబడులూ సరిపోయేవి. అంచేత వీళ్లు యెదిగేరు. ఇల్లుగట్టి అద్దెలకిచ్చేరు. బస్సులు నడిపేరు. లాడ్జింగులు తెరిచేరు. కాంట్రాక్టింగ్ వర్క్సు చేసారు. ఏవేవో చేసి యెదిగారు.

గానీ, నగరం వీరికంటే త్వరితంగా, అమితంగా యెదిగింది. సముద్ర ఆధారపోర్టూ, షిప్‌యార్డూ, మరోవేపు ఎరువుల ఫేక్టరీ, ఉక్కు పేక్టరీ, యింకేవేవో పెద్దా, చిన్నా కర్మాగారాలు వొచ్చేయి. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగులూ, అధికార్లూ చేరేరు. వారి కవసరమైన బిల్డింగులూ, పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లూ, స్టార్ హోటళ్లూ అవసరమయినాయి. వీరి పిల్లలకు కార్పొరేట్ విద్యాలయాలు, కుటుంబాలకు కార్పొరేట్ హాస్పిటల్సూ కావలసొచ్చేయి. ఇదంతా వొకవైపు... జనప్రవహం! మరోవేపు... పనులూ, ఉపాధీ కోల్పోయిన పల్లెవాసుల వలసల ప్రవాహం! నగరం జనప్రవాహంతో పొంగిపోయింది.

మూడో, నాలుగో బిల్డింగులు కట్టి, అద్దెలకిచ్చే వారికి అపార్ట్‌మెంట్ల పోటీ, దుకాణాలకూ, సంతలకూ కమర్షియల్ కాంప్లెక్సుల కాంపిటేషన్. కాంట్రాక్టర్లకూ – కంపెనీలు టెండరు బెట్టేయి. కార్పొరేట్ హాస్పిటళ్లూ, కాలేజీలు... దిగేయి.

శంభునాయుడికి గానీ, పాత్రుడికి గానీ, వీరిలాంటి స్థానిక పెట్టుబడి స్తోమతుగల వారికిగానీ– అందని మార్కెట్లొచ్చేయి.

"....అయిపోయింది. కాలచక్రం తిరిగేసింది గిర్రున. రాళ్లు తేలిపోయి, పిడకలు మునిగిపోయేయి. సూస్కోండి! యేరీ? గవర్లూ, యాదవులూ, నాగాశపోళ్లు యేరీ రథమ్మీద...? రథం దిగిపోనారు. చోట్లేదాళ్లకి. నత్తలూ, ఎండ్రకలూ, పిత్తపరిగెలూ... వొడ్డుకొసకి కెరటాలు కొడ్తే వొచ్చిపడినట్టుగ – నగరం సివార్లకి చెదిరిపోయేరందరూ. సముద్రగర్భంల– తిమింగలాలూ, పెద్ద పెద్ద చేపల్దే చోటు. నగరంలో... అంతే..." అనంటాడు, మూర్తి ప్రింటింగ్ ప్రెస్సులో పనిజేసే వో వర్కరు.

చివరికి కర్రి అప్పలరెడ్డి –

"...మరిపుడేం చెయ్యాలయ్యా? అప్పుడు, నువ్వు చెప్పినట్టు నలుగురం జాయింటయి దిగేం మార్కెట్లోకి, ఇప్పుడు అదీ చాల్దా...? మరేటి చెయ్యాలో ఆలోచించి, చెప్పవయ్యా..." అనడిగేడు మూర్తిని.

"...రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో – కార్పోరేట్ కాలేజీ డైరెక్టర్ చౌదరికి టిక్కెట్టొస్తాది. అతగాన్ని గెలిపించు..." చెప్పేడు మూర్తి.

"...ఆడికా! ఆడికెందుకిస్తారు...?"

"...కోమలి పట్నానికి తాగునీటి సమస్య తీరుస్తున్నాడు గనకా..."

"అంటేటి? ఆడు గోదారి నించి, సొంత కర్చుతోటి పైపులైను గానీ యేస్తాడా? యేటి?"

"...రాజకీయాలు నీటిచుట్టూ, మార్కెట్ చుట్టూ తిరుగుతున్నాయివయ్యా..." మూర్తి.

ఈ మాటల్తో శంభునాయుడికి మళ్లీ నీరూ, నాగరికతా అభివృద్ధి గురించి వాళ్లు మంత్రి వద్ద చేసిన సంభాషణ గుర్తొచ్చింది.......

సభ యెర్పాట్ల గురించి మంత్రి, శంభునాయుడ్ని వాకబు చేస్తే – వాళ్ళే, నాయుడి తరుపున – లోకల్ హోల్డున్న నాయుడుగారు తల్చుకుంటే సభ గురించి తిరుగు చూడనక్కర్లేదండీ అని హామీ యిచ్చేరు.

ఆ తర్వాత మంత్రిని, అదే సభలో కోమలి పట్నానికి, ప్రళయావతి నీటిని రప్పించబోతున్నట్టు ప్రకటించమన్నారు. మంత్రిగా, మీరు ప్రజలకిచ్చే అపురూప కానుక అది అన్నారు. ఏమంటారన్నట్టు శంభునాయుడు వేపు చూసేరు.

ఏమనగలడు శంభునాయుడు? వీళ్ళు – మన ఆలోచనల్ని గూడా మనల్ని చేయనీకుండా మన తరపున వీళ్లే ఆలోచిస్తామంటారు!? ఇదన్నమాట మనకులేని వారి గొప్పతనం – అనుకున్నాడు నాయుడు...

మూర్తి కొనసాగింపుగా–

"....రేపు సభలో మంత్రిగారు కోమలి పట్నానికి ప్రళయావతి నది నీటిని మళ్లించే పథకాన్ని ప్రకటిస్తారు. ప్రజలకు నీళ్లెన్ని అందుతాయో గానీ– యిటు వీరి కాలేజీలకూ, కంపెనీలకూ నీటి కొరతుండదు. అటు కాలవ టెండర్, ఆ వలస దొరల్ది అవక మానదు..."

యెన్నెన్నో ఆలోచనలు, జ్ఞాపకాలూ ప్రశ్నలు శంభునాయుడికి.. ప్రళయావతి నది గుర్తొచ్చింది.

ఎక్కడి ప్రళయావతీ నది...! ఎవరికి చెందాల్సిన నీళ్లు? ఎన్ని గ్రామాలు?? యెన్ని కుటుంబాలు...? చెదిరిన పక్షులు...?

"మీరు భూవులున్న వాళ్లకు నష్టపరిహార మిస్తారు. లేనివారికో? ఎవ్వరైనా– ఊరు విడిచి వెళ్లడమంటే– యింటి నాలుగ్గోడలనీ, ఊరి నాలుగు వీధుల్నీ విడిచిపెట్టి వెళ్ళడం కాదు. తరతరాల నిండీ కూడగట్టుకున్న అనుభూతుల్ని, అనుభవాల్నీ, అనుబంధాల్నీ వొదిలి వెళ్లటం! వాటికి పునరావాసం చూపగలరా...?"

అలనాడు, భూసేకరణ నాడు మా అందరి కంటే రైతుకూలీ సంగం వారే మంచి ప్రశ్న వేసారు...! దుఃఖం పొంగుతోంది మనసులో.......

ఇక, శంభునాయుడి వశం కాలేదు. నిభాయించుకోలేకపోయాడు. ఆవేశంగా లేచేడు. ఏసీ గది గోడల్ని రెండు చేతుల్తో చరిచాడు. ఊగిపోతూ, అటూ ఇటూ వోసారి తిరిగేడు. చివాల్న తిరిగొచ్చి కూచొని– కాళ్లు చాపి, యెదురుగన్న– టీపాయ్‌ని తన్నేడు.

ఇంకేమీ చేయలేక, జుత్తు పీక్కొని– దుఃఖపు కెరటాలు యెగసి పడగా – వెక్కి వెక్కి శబ్దరహితంగా యేడ్వసాగేడు. మిత్రులందరూ బిక్కచచ్చిపోయేరు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. కాసేపటికి, పాత్రుడే తేరుకొని –

"...యిదేటివయ్యా? నువ్విలగ డీలా పడిపోతావేటి వయ్యా? యిల్లలగ్గానే, పండుగయి పోతాదేటివోయ్? రానీయి...! నీళ్ళు రానీ, ఎలక్షన్ రానీ, టిక్కెట్ రానీయి!

ఈటన్నీటికీ మనం కష్టపడి గెలిపించిన మినిస్ట్రే కారణమయితే, ఆడికీ, ఆడిచేత ఆడించినోళ్ళకీ, ఆడిగవర్నమెంట్‌కీ ముసలం తెద్దాం! మనకీ, మన బిజినెస్‌కీ, మన పోలటిక్స్‌కీ అక్కరకు రాని ఆడెందుకు? ఆడి పదవెందుకు? ఆడికొక సభా సన్మానమెందుకు? అలాగే, నువ్వన్నట్టే ఆ సభకు... మందూ వొద్దు. జనమూ వొద్దు జేజేలూ వొద్దు, ఏటొద్దు ఏటొద్దు.

ఇచారించకు. లెగు, లెగు, నువ్వు ముందడుగెయ్యి... నీ యెంట మీము నడుస్తాం..." అని, పలు విధాల అనునయించేడు.

గానీ, శంభునాయుడి మనసో క్షణం ప్రళయావతీ నది చుట్టూ, మరోక్షణం ప్రస్తుత స్థితి చుట్టూ.......

ప్రళయావతీ ఆరంభ శూరత్వం అన్నట్టయ్యింది. నత్తనడకన పనులు సాగేవి. ఏళ్ళు గడిచేవి. సగం నిర్మాణమే అయ్యింది. మోతుబరి రైతులూ, ధనిక రైతులూ– ఊరొదిలి, వేరెక్కడో జీవితాల్ని ఆరంభించేరు. గానీ, పేదరైతులూ...రైతు కూలీలు అక్కడే, కూల్తోన్న చెట్టు కొమ్మల చివర రెక్కలాన్చి యెగరని పక్షుల్లా...! వీళ్లంతా– నిర్మాణం కోసం ప్రభుత్వం ఎక్వయిర్ చేసిన భూమిని సాగుచేయనారంభించేరు. పంటలు పండించసాగేరు.

పెద్ద రైతులు ఆ భూములు మావి అనన్నారు. పేద రైతులు మీకు పరిహారమందింది, అడిగే హక్కులేదన్నారు. ఘర్షణ, కోర్టులూ, కేసులూ, తండ్రిగూడా...! ప్రళయావతి... ఎందరినెన్నెన్ని మార్పులకి గురిచేసిందో...!

పేదల్ని... సంఘటిత పరచిన... ఆ కిరణ్ వున్నాడా? ఎలా వున్నాడూ? ఆ రైతుకూలి సంగం...?

"కోడిపిల్లల మీద నక్కల తీర్పులు, మేక పిల్లల మీద పులుల తీర్పులూ యిక సాగవ్..."

తండ్రి నిర్వహించిన వొక పంచాయితీని ధిక్కరిస్తూ, సంగం జవాబు. అసలీ వైరానికి...యేది పునాది?

"ఆస్తి" మూర్తి, వోసారి విశ్లేషించి చెప్పేడు.

మరి యీ...వైరమో...?.....

ఈ ప్రశ్నతో... మళ్లీ వర్తమానంలో కొచ్చేడు శంభునాయుడు. దుఃఖోద్వేగాన్ని –

నిభాయించుకున్నాడు. ఓసారి మిత్రుల వేపు చూసేడు. మూర్తి ఆలోచిస్తున్నాడు గానీ, గతంలోలాగా యీసారి మార్గమేదీ కనబడటం లేదు. ఒక దశవరకూ, అతనికి విశ్లేషణకు అందినవి... తర్వాత అందటం లేదు. ఆనకట్టలూ, మార్కెట్లూ, హైటెక్ కంపెనీలూ, వాటి ప్రభావాలు అందటం లేదు...

"...ఎమ్మెల్యేగా మీరు గెలిపించేరు గానీ, అతనికి మంత్రి పదవిని 'వాళ్లు' లాబీయింగ్ చేయగలిగేరు..." అనన్నాడు మూర్తి.

"...యిది ఊడిపోతే, నంజి కొడుక్కి అది ఊడిపోదేటి?" అనరిచేడు పాత్రుడు.

"ఊడదు. మరోచోట, గెలిచేచోట నిలబెట్టి, మంత్రి పదవిని ఖాయపరుస్తారు. రాజ్యాంగం ఆ ఛాన్సిచ్చింది...." అన్నాడు మూర్తి. అందుకనే గావాల. ఈ దొంగల రాజ్యాంగం రచనే వొక కుట్ర అనీ పాడుతాం, పాడుతాం అంటారు సంగం వాళ్లు – శంభునాయుడికి అన్పించింది.

"...అయితే, యింతకీ యిపుడేటి చెయ్యిమంటావయ్యా..." అనడిగేడు యువసేన లీడరు.

"చెప్పేదుగదేటి. చౌదరిని ఛెయిర్మెన్ చేయించటం, వలసదొరలకి కాంట్రాక్టు లిప్పించటం..." పాత్రుడు యెకసెక్కెంగా.

"...అంతే. మరోమార్గం లేదు. మీ పెట్టుబడులూ, వ్యాపారాలూ, మీ పరపతీ.... ముందుకెళ్ళాలంటే వాళ్లతో రాజీ పడాలి...." చెప్పేడు మూర్తి.

"...పులెనక వరదలాగన్నమాట. అది వొదిలీసిన దుమ్ములూ, పొట్టూబుర్రా చీకాలన్నమాట..." కంఠసించుకున్నాడు పాత్రుడు.

మూర్తి యింకా స్పష్టంగా, కమ్యూనిస్టులన్నట్టు – దళారులకు దళారులవ్వాలి, అని చెప్పేడు.

అప్పుడు, శంభునాయుడు 'వొరే సేల్సూ, సెల్ యియ్యరా' అనడిగేడు. మంత్రిని హెచ్చరిస్తాడనుకున్నారు మిత్రులు. గానీ, శంభునాయుడు, మెయిన్ గొడాం మేనేజరుతో మాటాడేడు. తెల్లారేసరికి సరుకు దింపించమన్నాడు. మిత్రులు ఆశ్చర్యంగా చూసేరు –

"...అంతే! ఆ నంజికొడుకులెంత తెలివిగా, యెంత గుప్తంగా యెత్తులేస్తున్నారో, మనమూ అలాగెయ్యాల. ఎదిరించి, వైరమవటం గాదు, జట్టుగట్టి ఆడాలి. ఆళ్ళు ఆడే ఆటని, ఆళ్ల జట్టులోనుండే వోడించాలి. టిక్కెట్ ఆళ్ళకొస్తే ఓడించాలి. కాంట్రాక్ట్ దొరలదయితే కాస్ట్ పెంచీయాల..." యిలా, యేదో, సుదీర్ఘ పథకమాలోచించి, చెప్పేడు శంభునాయుడు.

⁂ ⁂ ⁂

ఎవరి పథకాలు... యెలా వేసుకున్నారో గానీ, మంత్రిగారి సభ విజయవంతంగా

జరిగింది. సారాచుక్కల కరువని జనం అనుకోలేదు. నీటి కరువుని- తీర్చేందుకు, ప్రళయావతిని మళ్ళించే పథకాన్ని - మంత్రిగారు ప్రకటించేరు. కోమలి ప్రజల హర్షధ్యానాలు...

✻ ✻ ✻

మంత్రిగారి ప్రకటనతో ప్రళయావతీ ప్రాంత రైతాంగం ఆందోళనకు దిగేరు. నిరసనలు, ధర్నాలూ ఊరేగింపులూ....

అది, ఆదివాసీప్రాంతనది అనీ, సాగునీటి రిజర్వాయరనీ - తాగునీరూ, సాగునీరు... యీ ప్రాంతానికే చెందాలనీ డిమాండ్. కోమలికి గానీ, విశాఖకు గానీ గోదావరి నీటిని రప్పించండి, గోదారి నీటిని కళింగ కొస వరకూ రప్పించవచ్చు అని గూడా, వివరమైన గణాంకాల్తో కరపత్రాలూ. పత్రికల నిండా- రోజూ యివే ప్రముఖ వార్తలు. శంభునాయుడికీ వార్తలు ఆనందాన్ని కలిగించేయి. ఏవేవి జరిగితే బాగుణ్ను అని అనుకుంటున్నాడో- వాటినే, ఆ ప్రాంతం ప్రజలు ఆందోళన చేస్తూ, డిమాండ్ చేస్తున్నారు!

గానీ, ఈ ఆందోళనకు “సంగం” నాయకత్వం...!?

ఇదేవిటి.. ఎల్లప్పటికీ వైరమే తమ మధ్య... అనుకున్న ‘సంగం’ యిపుడు... తమ కోర్కెల కనుగుణంగా యెందుక్కనిపిస్తోంది? తన తండ్రీ, బంధుగణం, గ్రామాలూ... ప్రళయావతీ ప్రాంతమంతా యెలా వుంది...? పత్రికల్లో వొక వారం తరువాత ఆగిపోయేయి వార్తలన్నీ, సెన్సేషన్ కాబోవటం లేదని కాబోలు....! ఓసారి... ప్రళయావతి ప్రాంతం వెళ్లి వొస్తే బాగుణ్ను అనుకున్నాడు శంభునాయుడు. అప్పుడే మంత్రిగారి నుంచి ఫోన్! ప్రళయావతీ రిజర్వాయర్ ప్రాంతానికి వెళ్తున్నాను, వస్తావా అని...! బయల్దేరాడు శంభునాయుడు. వెంట మిత్రులు నలుగురూ. మంత్రిగారి కారుకి ముందూ, వెనకా సెక్యూరిటీ వాహనాలు, ఆ తర్వాత అధికార్ల వాహనాలూ, తర్వాతనుండాల్సిన శంభునాయుడి టాటా సుమోకి ముందర వలస దొరల ఖరీదైన కార్లూ, చౌదరి బృందపు కార్లూ చేరేయి.

శంభునాయుడు దారి పొడుగునా, తన బాల్యము, ప్రళయావతీ నదికి దగ్గర్లోని కొండ దిగువ హైస్కూల్లో విద్యాభ్యాసం, జై ఆంధ్రా ఆందోళన, ఆ స్కూల్ దగ్గరి రైల్వేగేట్ని విధ్వంసం చేయటం, ఆ కొండకి అవతల కొంత దూరంలో నాగావళీ నదీ, ఆ నది ఆవల ఆదివాసీ ప్రాంతంలోని విప్లవోద్యమం...

గలాగలా, గతాన్ని వొలకబోసుకున్నాడు మిత్రుల వద్ద.

మధ్యాహ్నానికి- ప్రళయావతీ రిజర్వాయిర్ చేరేరు. సాయుధ పోలీసులే యెక్కడ చూసినా! పోలీసులు, వాహనాలూ, తప్పా జంక్షన్ నుండి, రిజర్వాయర్ దాకా యెక్కడా జనసంచారం లేదు.

రిజర్వాయర్ ప్రాంతానికి చేరేరు. ఎత్తయిన గోడలేచింది, సుదూర ప్రాంతం... మొక్కా, మొలకా, యేమీ లేదు. రిజర్వాయర్‌లో కొంత వరకూ నిండిన నీళ్ళు- చలన రహితంగా...బిక్కచచ్చినట్టున్నాయి!

ఎన్నెన్నింటినో ముంచేసిన నీళ్లు...! కంటికి, యెక్కడా యిల్లు గానీ, పొల్లుగానీ, పల్లెగానీ,... కన్పించడంలేదు....శంభునాయుడికి మనసంతా... తడిసి ముద్దయిన వరికంకిలా వుంది. మంత్రి... యేదో అడుగుతున్నాడు. అధికార్లు వివరిస్తున్నారు. వలసదొరలు ముందుకు వొచ్చి- ఇంజనీరింగ్ అధికార్లకేవో ప్రశ్నలు వేసి, యింకేవో సూచనలు చేస్తున్నారు. ఆ దృశ్యం చూస్తే రిజర్వాయర్‌ని వారు, వారి కోసం నిర్మించబోతున్నట్టు, నిపుణులకు అందుకు నంబంధించి సలహాలిస్తున్నట్టు... అన్పిస్తుంది.

బాధతో, కోపంతో శంభునాయుడు అక్కడ్నించి కిందకొచ్చేసాడు.

క్రిందన యేదో గొడవ. సాయుధ పోలీసుల్తో యెవరో వాదన. చివరికి రాజీ మార్గంగా పోలీసులు వాళ్లలో నలుగుర్ని లోపలికి రానిచ్చేరు. అప్పటికి మంత్రిగారూ కిందకి దిగేరు.

"...మీకు రిప్రజెంటేషనిస్తారట. ప్రళయావతీ రిజర్వాయర్ రైతాంగ సమాఖ్య అట. పేరు అది గానీ, లీడర్లు రైతుకూలి సంగం వారే..." అని పోలీసులు, మంత్రిగారికి, ఆ నలుగుర్నీ చూపుతూ ఫిర్యాదు చేసారు.

శంబునాయుడు ఆసక్తితో ముందుకొచ్చి, చూసేడు. ఆ నలుగురిలో కిరణ్ వున్నాడు!

"...యీ రిజర్వాయర్, తొందరలో పూర్తి చెయ్యాలనే మిషతో డిజైన్ మార్పు చేసి, కెపాసిటీ తగ్గించ ప్రయత్నిస్తున్నారని తెలిసింది. అలా వీల్లేదు. ప్రారంభపు డిజైన్ మార్చరాదు. (శభాష్, 'యేం నిర్దేశిస్తున్నావురా- శంభునాయుడు అసంకల్పితంగా మనసులో మెచ్చుకున్నాడు)

ఈ రిజర్వాయర్ నీటిని, యీ ప్రాంతానికి వినియోగించాలి. మరో ప్రాంతానికి మళ్ళించరాదు. (శభాష్...అదీ లీడర్‌షిప్..)

వలస వచ్చిన పెట్టుబడుల దొరలు పెట్టే ఫార్మా, బయో, ఐటి కంపెనీలకు అనుగుణంగా డిజైన్ మార్పులూ, తొందర్లో పూర్తి చేయటాలూ మీ లక్ష్యం కాకూడదు..." రిప్రజెంటేషన్ సారాంశాన్ని మూడు ముక్కల్లో చెప్పేడు కిరణ్.

రిప్రజెంటేషనందుకొని, చూద్దాం.. పరిశీలిస్తాం.. అన్నారు మంత్రిగారు. ఇక వెళ్లండన్నట్టు- చూసేరు పోలీసులు, ఆ నలుగురి వేపూ. కానీ ఆ నలుగురూ కదల్లేదు. మాకు స్పష్టమైన హామీ కావాలన్నారు.

మంత్రిగారు చిరాకు ప్రదర్శించేరు. పోలీసులు తమ శైలిలో ఆ నలుగుర్నీ

అక్కడ్నించి పంపబోయేరు. అంతలో, యెక్కడి నించి, యెలా చేరుకున్నారో నలువేపుల నించీ జనం! చేతుల్లో ప్లేకార్డులు! నినాదాలు! ప్రజల ముందు స్పష్టంగా హామీ ప్రకటించండని, డిమాండ్ చేసారు.

ఒక్కసారిగా పోలీసులు తమ ఆయుధాల్తో జనమూహమ్మీద పడ్డారు. కొందరు, మంత్రిగారిని సేఫ్ కవరింగ్ చేసి, కారెక్కించేరు. జనం కారుకి అడ్డురాబోయేరు. లాఠీలూ, ఇనపబూట్లూ యీడ్చేసాయి.

కార్లు వెళ్లిపోయేయి. వాహనాల వరుస కదలిపోయింది. హాహా కారాలూ, లాఠీలు విరిగిన చప్పుళ్ళు. ఎగసిన నినాదాలూ... నిలబడి వుండిపోయేడు శంభునాయుడు! ఆయనకంతా... కలగాపులగం...దేహంలో రక్తం– అడ్డదిడ్డంగా ప్రవహించుతున్నట్టూ, మెదడు నిండా శూన్యమేదో నిండినట్టూ, అపస్మారకంగా వుంది! అదోలా చూస్తూ నిల్చున్నాడు. అప్పుడే ఓ వృద్ధ రైతు, తలపాగా తీసి పతాకంలా యెగురవేసి, గొంతుపూరాగా–

"...ఈ నది మాది. ఈ నదికింద బతుకులు మావి... ఎవుడ్రా...దీన్ని మింగివోడు..." అని అరిచేడు.

శంభునాయుడు ఆ కేకకు ఉలిక్కిపడి. వృద్ధుని వేపు చూసేడు. అంతే! కళ్లు గిర్రున తిరిగేయి...! ఆ వృద్ధుడతని తండ్రి.

"...నాయినా..." అని దుఃఖపు గొంతుతో పలకరించేడు తండ్రిని. ఆ వృద్ధుడు గూడా అప్పుడే చూసి, కొడుకుని పట్టుకొని, రిజర్వాయర్ వేపు చూపుతూ... యేదో మాట్లాడబోయేడు. గానీ మాటలు రావటం లేదు...! ★

*ప్రజా సాహితి, నవంబరు 2005*